నినాదం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం
17 జనవరి 2025
తెలంగాణ ప్రాంతీయం



## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పెట్లోళ్ల కార్తిక్ రెడ్డి

చేవెళ్ల జనవరి16(నినాదం న్యూస్):- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పెట్లోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధి కేసారం గ్రామ రెవెన్యూలోని బృందావన్ కాలనీలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అయిందని అన్నారు.రైతు భరోసా కింద 15000 ఇస్తానని చెప్పి, మాట మారుస్తుందని, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలను మాఫీ చేస్తానని, చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతుందని అన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు..ప్రజా ప్రభుత్వ రైతు వ్యతిరేఖ విధానాలకు నిరసనగా షాబాద్ లో రైతులతో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి మాజీ జెడ్పిటిసి అవినాష్ రెడ్డి మాజీ కాంసెన్సీ ఇంచార్జ్ దేశమొల్ల ఆంజనేయులు మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ షాబాద్ మండల అధ్యక్షుడు నర్సింగ్ రావు హనుమంత్ రెడ్డి, విగ్నేష్ గౌడ్ అంజన్ గౌడ్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.


## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి



జమ్మికుంట, జనవరి 16 (నినాదం న్యూస్) : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రావణ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఒక సైకో మాదిరిగా వ్యవహరిస్తు న్నాడని వాళ్ళ పార్టీ యజమాని మెప్పు పొందడం కోసం రాష్ట్ర ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాడని అన్నారు. బాద్షా సినిమాలో మాదిరిగా మన ప్రభుత్వం వస్తే నువ్వు మంత్రి అవుతావని చెప్పడంతో ఆ భ్రమల్లో కౌశిక్ రెడ్డి జీవిస్తున్నాడని కానీ రాష్ట్ర ప్రజల దృష్టిలో ఒక జోకర్ ని తలపిస్తున్నడని ఎద్దేవా చేసారు.కౌశిక్ రెడ్డి కి మహిళల పట్ల, దళితుల పట్ల గౌరవం లేదని ఒక మహిళా గవర్నర్ ని సైతం అసభ్య పదజాలంతో దూషించి మహిళా కమిషన్ వద్ద క్షమాపణలు చెప్పిన సందర్భాలు ఉన్నాయని హుజురాబాద్ ప్రజలు ఓట్లు వేయకపోతే నా శవ యాత్ర చూస్తారని బెదిరించి సెంటిమెంటల్ బ్లాక్మెయిల్ చేసి గెలిచి ఇప్పుడు హుజురాబాద్ ప్రజల సమస్యల్ని గాలికి వదిలేసి ఎమ్మెల్యే లని,స్పీకర్ ను ఎవ్వరిని లెక్కచేయకుండా ఒక సైకో లాగా వ్యవహరిస్తున్నాడని గతంలో సైతం ఎమ్మెల్సీ గా ఉన్న సందర్భంలో ఎంతోమంది అమాయకులని ఇబ్బందులకు గురి చేశాడని సొంత పార్టీ కార్యకర్తల పై కేసులు పెట్టించిన సందర్భాలు కూడా ఉన్నాయని,మీడియా వాళ్ళను సైతం ఇంట్లో బంధించి దాడులకు సైతం పాల్పడ్డాడని గుర్తుచేశారు.ఇలాంటి వాళ్ళు ఎమ్మెల్యేగా ఉంటే తెలంగాణ సమాజానికి చాలా ప్రమాదం అని అన్నారు. ప్రజలపట్ల,అధికారుల పట్ల,సహచర ఎమ్మెల్యేల పట్ల దురుసుగా వ్యవరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

# బీఆర్ఎస్ నేతలను ఇబ్బందిపెట్టడమే సీఎం రేవంత్‌రెడ్డి పని

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



**కరీంనగర్, జనవరి 16 (నినాదం న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డ్వైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎక్కడికిపోయాయని ప్రశ్నించారు. హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా, రైతుబీమా పథకాలు ఎక్కడ అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. అక్రమ కేసులతో కేటీఆర్‌ను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా–ఈ రేసు నిర్వహణకు ప్రపంచ దేశాలు పోటీపడతాయని చెప్పారు. దేశంలోని ఎన్నో రాష్ట్రాలు రేసు నిర్వహణకు పోటీపడ్డాయి. కేటీఆర్ ఎంతో కష్టపడి హైదరాబాద్‌లో ఈ రేసును నిర్వహించారని తెలిపారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనను మరిపిస్తున్నారని మండిపడ్డారు. ఫార్ములా–ఈ రేస్ నిర్వహణతో టెస్లా వంటి ఎన్నో పెద్ద కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని చెప్పారు. ఓటుకు నోటు కేసులో దొంగ కాబట్టి.. రేవంత్ అందరూ దొంగలే అనుకుంటున్నారని విమర్శించారు. అవినీతి అనేదే లేనప్పుడు ఈడీ కేసు ఎలా పెడుతుందన్నారు. ఒకసారి తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు. తెలంగాణలో డ్వైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులను అరెస్టు చేసి రాష్ట్రాన్ని దోచుకోవాలని రేవంత్ చూస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ కోట్లాది రూపాయలకు అమ్ముడు పోయాడని, అందుకే నీది ఏ పార్టీ అని అడిగానని చెప్పారు. మా బట్టలు విప్పుతామంటే ఊరుకోవాలా అని ప్రశ్నించారు. సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో లేకుంటే వార్డు మెంబర్‌గా కూడా గెలవడంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. కరీంనగర్ సమీక్ష సమావేశంలో మంత్రుల ఆదేశాల మేరకు ఎమ్మెల్యేనైన తనను అంతా బెదిరించారని చెప్పారు. కరీంనగర్ ఆర్డీవో ఎవరో తనకు తెలియదని, ఆయన తనపై ఎలా కేసు పెడతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గతంలో మంత్రి డీకే అరుణని తిట్టలేదా, జూపల్లి కృష్ణారావుని నోటికొచ్చి నట్లు మాట్లాడితే ఆయనపై కేసు పెట్టారన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమారే తనపై దాడి చేశాడన్నారు. సమావేశంలో తనది కాంగ్రెస్ పార్టీ అని అధికారుల సమక్షంలో చెప్పిన సంజయ్ కుమార్‌ను డిస్ క్వాలిఫై చేయాలని డిమాండ్ చేశారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసు, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు లేవని, పీడీ యాక్ట్ ఎలా పెట్టాలని చూస్తున్నారని ప్రశ్నించారు. ఒకవేళ పెట్టాలనుకుంటూ రేవంత్ రెడ్డితో మొదలు పెట్టాలన్నారు. 13 నెలల్లో అక్రమ అరెస్టులు తప్ప రేవంత్ రెడ్డి రాష్ట్రంలో చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఒక్క హామీ నెరవేర్చకుండా 13 నెలలుగా రేవంత్ సర్కార్ కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. అవినీతే లేని ఫార్ములా–ఈ కార్ రేసు కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. కాంగ్రెస్ చిల్లర చేష్టలతో బీఆర్ఎస్ నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కేటీఆర్, హరీశ్‌రావులపై మాట్లాడే స్థాయి మేడిపల్లి సత్యంకు లేదని విమర్శించారు.

## సమస్యలపై నినాదం అక్షర పోరాటం

-సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి



కోదాడ/అనంతగిరి జనవరి, 16 (నినాదం న్యూస్): నిష్పక్షపాతంగా వార్తల అందిస్తూ ప్రజా సమస్యలపై నినాదం దినపత్రిక నిరంతరం పోరాటం కొనసాగించడం అభినందనీయం అని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి అన్నారు. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో నినాదం దినపత్రిక 2025 క్యాలెండర్ ను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు... గడిచిన కొన్ని సంవత్సరాలుగా అనేక సమస్యలపై వార్తలను నినాదం ప్రచురించి పరిష్కారం దిశగా, అడుగులు వేసిందన్నారు. భవిష్యత్తులో ఇంకా మంచి వార్త కథలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని వీరబాబు, గ్రామ నాయకులు హనుమారెడ్డి పాల్గొన్నారు.

# భారత్‌లో భారీగా పెరిగిన ఇంటర్నెట్ వాడకం

## యూజర్ల సంఖ్య 90 కోట్లను దాటుతుందని అంచనా

**న్యూఢిల్లీ,జనవరి16(నినాదం న్యూస్):** భారతదేశంలో రికార్డు స్థాయిలో ఇంటర్నెట్ యూజర్లు పెరుగుతున్నారు. 2025 నాటికి దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 90 కోట్లను దాటుతుందని గురువారం ఒక నివేదిక వెల్లడిరచింది. డిజిటల్ కంటెంట్ కోసం దేశంలోని ప్రాంతీయ భాషల వినియోగం పెరుగుతుండటం ఇంటర్నెట్ యూజర్ల పెరుగుదలకు కారణంగా ఉందని చెప్పింది. ఇండియాలో 2024 నాటికి ఈ సంఖ్య 88.6 కోట్లకు చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం బలమైన వృద్ధిని సూచిస్తుంది. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ,మరియు కాంటార్ నివేదిక ప్రకారం, 488 మిలియన్ల వినియోగదారులతో గ్రామీణ భారతదేశం ఈ వృద్ధికి నాయకత్వం వహిస్తుంది. మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో గ్రామీణ వినియోగదారులు 55 శాతం వాటాని కలిగి ఉన్నారు. దాదాపుగా అందరు యూజర్లు, అంటే 98 శాతం మంది భారతీయ భాషల్లో కంటెంట్‌ని యాక్సెస్ చేశారు. తమిళం, తెలుగు, మలయాళం వంటి భాషల్లో విస్తృతమైన కంటెంట్ ఉండటం కారణంగా అత్యంత ప్రజాదరణ లభిస్తోంది.పట్టణ ఇంటర్నెట్ యూజర్లలో సగానికి పైగా అంటే, 57 శాతం మంది ప్రాంతీయ భాషల్లో కంటెంట్‌ని ఇష్టపడుతున్నారు. ఇది అన్ని ప్లాట్‌ఫారమ్స్‌లో స్థానిక భాష కంటెంట్‌కి పెరుగుతున్న డిమాండ్‌ని చూపిస్తోందని నివేదిక పేర్కొంది. గతేడాది నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గేమ్ ఛేంజర్‌గా మారింది. ప్రతీ 10 మంది ఇంటర్నెట్ యూజర్లలో 9 మంది ఏఐ ఎంబెడెడ్ కలిగిన యాప్స్‌ని వాడుతున్నారు. భారతదేశంలో జెండర్ గ్యాప్ కూడా తగ్గుతోందని, మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో 47 శాతం మంది మహిళలు ఉన్నారు. ఓటీటీ వీడియో, మ్యూజిక్ స్ట్రీమింగ్, ఆన్‌లైన్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా వినియోగం వంటి కార్యకలాపాలతో గ్రామీణ భారతం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ వర్గాలు పట్టణ వినియోగదారుల్ని మించిపోయారు. 2023 మరియు 2024 మధ్య 54 శాతం పెరిగిన స్మార్ట్ టీవీలు మరియు స్మార్ట్ స్పీకర్లు వంటి సాంప్రదాయేతర పరికరాల స్వీకరణలో అర్బన్ ఇండియా ముందుంది. ఇదే సమయంలో పట్టణ, గ్రామీణ జనాభాలో ఇంటర్నెట్ యాక్సెస్ చేయడానికి మొబైల్ ఫోన్స్ అనేవి ప్రాథమిక మార్గంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది.

# ప్రధానికి కృతజ్ఞతలు చెబితే ఆయనకు ఎందుకు అభ్యంతరం

## -ఎంపీ అరవింద్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

**ఖమ్మం, జనవరి 16 (నినాదం న్యూస్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ఏర్పాటుపై తెలంగాణ మంత్రిగా ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెబితే అరవింద్‌కు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. తన రాజకీయ జీవితంపై అరవింద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అరవింద్ దిగజారి మాట్లాడుతారని ఊహించలేదని విమర్శించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి తుమ్మల పర్యటించారు. బుధవారం రాత్రి అగ్నిప్రమాదంలో దగ్ధమైన పత్తి బస్తాలను పరిశీలించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగిన తర్వాత సిబ్బంది నిర్లక్ష్యం చేయడంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. అగ్ని ప్రమాద ఘటనలో పత్తి బస్తాలు దగ్ధం అవ్వడం దురదృష్టకరమని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల వాగ్దానంలో భాగంగా రూ.100 కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. రైతులకు సౌకర్యంగా ఉండేలా వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడిరచారు.

# తెలంగాణ సాకారంలో జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయం

**న్యూఢిల్లీ, జనవరి16(నినాదం న్యూస్):** ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢల్లీ దాకా సాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎంఎల్‌ఏలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న ప్రయాగ్‌రాజ్

- మహాకుంభమేళాలలో భారీగా తరలివస్తున్న భక్తులు
- భక్తులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ఏర్పాట్లు



**ప్రయాగ్‌రాజ్, జనవరి 16(నినాదం న్యూస్):** భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హార్ హార్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది.ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మూడో రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు నాలుగోరోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే మంగళవారం నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది. అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు. మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది. మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మఠాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు.శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు.35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు. ఇది కాకుండా, జునా అఘోరా, ఆవాహన్ అఘోరా, పంచాగ్ని అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు కూడా అమృత్‌లో స్నానం చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి నేతృత్వంలోని కిన్నార్ అఘోరా సభ్యులు కూడా జునా అఘోరాతో పాటు పవిత్ర స్నానమాచరించారు. పెద్ద రథంలో ఘాట్ వద్దకు చేరుకున్న నాగ సాధువుల బృందం అనుసరించింది.నాగ సాధువులు ఈటెలు, త్రిశూలాలను ధరించి, వారి శరీరాలపై బూడిద పూసుకుని, కొన్ని గుర్రాలతో ఊరేగింపుగా రాజ స్నానానికి బయలుదేరారు. జుట్టులో పువ్వులు, మెడలో దండ, చేతిలో త్రిశూలంతో మహాకుంభానికి ఆధ్యాత్మిక వైభవాన్ని జోడిరచింది.

# సైఫ్ అలీఖాన్‌పై దాడి.. ఆటోలో తరలింపు

**ముంబై,జనవరి16(నినాదం న్యూస్):** సైఫ్ అలీఖాన్‌పై దాడి, ఆస్పత్రిలో చేరిక తదితర అంశాలన్నీ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అన్నీ అనుమానాస్పదంగానే ఉన్నాయి. బాలీవుడ్ స్టార్ నటుడే కాదు. రాజకుటుంబానికి చెందిన వాడు. వేలకోట్లకు అధిపతి. ప్రపంచం నలుమూలలా విలాసవంతమైన ఇళ్లు, లెక్కలేనన్ని లగ్జరీ కార్లు అతడి సొంతం. కానీ, గురువారం అర్ధరాత్రి దుండగుడి దాడిలో గాయపడిన సైఫ్‌కు ఆస్పత్రికి వెళ్లేందుకు ఒక్క కారు కూడా సిద్ధంగా లేదు. దీంతో గాయాలతో రక్తమోడుతున్న తండ్రిని కుమారుడు ఇబ్రహీం ఆటోలో తీసుకెళ్లాడని తెలియడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఇంటి నిండా స్టార్లున్నా అత్యవసర సమయంలో ఒక్క కారూ అందుబాటులో లేకపోవడం అందరినీ విస్మయపరుస్తోంది. ప్రస్తుతం లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు సైఫ్ అలీఖాన్. ఎలాంటి ప్రాణాపాయం లేదని ఇప్పటికే వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.గుర్తుతెలియని తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. అయితే వీఐపిలు ఉండే, సెక్యూరిటీ ఉండే ఇంట్లోకి దుండగుడు ఎలా దూరాడన్నది కూడా అనుమానంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న సైఫ్‌ను ఆస్పత్రికి తరలించేందుకు సమయానికి కారు సిద్ధం కాలేదంట. బాంద్రా నుంచి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న లీలావతి ఆస్పత్రికి చేర్చడం కుటుంబ సభ్యులకి సవాలుగా మారింది. దీంతో, సమయం వృథా చేస్తే ప్రమాదమని గ్రహించిన పెద్ద కుమారుడు ఇబ్రహీం ఆటోలో లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. దాడి తర్వాత



గాయపడిన సైఫ్‌ను ఆటోలో తీసుకెళ్లారు అనేందుకు సాక్ష్యంగా ఓ వీడియో చక్కర్లు కొడుతోంది. అందులో ఆటో పక్కన నిలబడి సైఫ్ భార్య, నటి కరీనా కపూర్ ఇంట్లో సిబ్బందితో మాట్లాడుతున్నట్టుగా కనిపించడంతో అందరూ ఇది నిజమని నమ్ముతున్నారు. సైఫ్ అలీఖాన్‌పై ఇంట్లోనే అనూహ్య దాడి జరగడంతో సినీ, రాజకీయ ప్రముఖులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంబైలో సెలబ్రిటీలు నివసించే విలాసవంతమైన ప్రాంతంగా పేరుగాంచిన బాంద్రాలోనే రక్షణ లేకపోతే ఇంకెక్కడ ఉంటుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. గతేడాది ఎన్సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బాబా సిద్ధిఖీని బాంద్రాలోనే కొందరు దారుణంగా కాల్చి చంపారు. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ఇంటి ముందు కాల్పుల ఘటన తర్వాత బుల్లెట్ ప్రూఫ్ హౌస్‌లోనే ఉంటున్నారు. సెలబ్రిటీలు, రాజకీయ నేతలపై వరస దాడులు జరగడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

# పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ





**మహాముత్తారం, జనవరి 16(నినాదం న్యూస్):**
మంథని నియోజకవర్గంలోని పలు మండలాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. మహాముత్తారం, మహాదేవ్‌పూర్, కాటారం మండలాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారితో పాటు వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. మహాముత్తారం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ఉకాటి జైపాల్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి లను ఆయన పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మహదేవ్ పూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ఐత బాపు రెడ్డీ, కాటారం మండలం గుంద్రాత్ పల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ గజ్జెల రామయ్య, కొత్తపల్లి గ్రామంలో పెద్ది లక్ష్మీ, మహాముత్తారం మండలానికి చెందిన మల్లయ్య యాదవ్ ఇటీవల మరణించగా వారి కుటుంబాలను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

# త్వరితగతిన మినీ జాతర ఏర్పాట్లను పూర్తి చేయాలి



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):**
ఫిబ్రవరి 12 నుండి 15 వరకు జరిగే మినీ మేడారం జాతరకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలం మేడారంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మిక పర్యటించి క్యూలైన్, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ మేడారం జాతరను పురస్కరించుకొని ప్రతిరోజు వేలాది మంది భక్తులు అమ్మవాళ్లను దర్శించుకుంటున్నారని, ఈ సందర్భంలో పారిశుధ్యం లోపించకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపరచాలని సూచించారు. భక్తులు క్యూ లైన్ లో గద్దెల ప్రాంతానికి వెళ్తున్న సమయంలో తోపులాట జరగకుండా చూసుకోవాలని, అక్కడ త్రాగునీటి ఏర్పాటు చేయాలని, గద్దెల ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంపన్న వాగు ప్రాంతంలో పుణ్య స్థానాలు ఆచరించిన అనంతరం మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ శుభ్రమైన మంచి నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఎంపిడిఓ సుమన వాణి, పంచాయితి కార్యదర్శి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండలో కొనసాగుతున్న భక్తుల రద్దీ





**భీమదేవరపల్లి జనవరి 16 (నినాదం న్యూస్):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారికి భక్తులు కోర మీసాలు, కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి పుష్ప యాగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సప్తవర్ణాల ఏకాంత సేవలో వీరభద్ర స్వామి సేద తీరారు. ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పుష్పయాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో జాతర చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, ఈవో కిషన్ రావు, అర్చకులు రాజయ్య, రాంబాబు, వీరభద్రయ్య, వినయ్ శర్మ తదితరులు ఉన్నారు.



# హోటల్స్‌లో మద్యం సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటాం

- హోటల్ నిర్వాహకులకు కౌన్సిలింగ్ నిర్వహించిన సీఐ వరగంటి రవి




**జమ్మికుంట, జనవరి 16 (నినాదం న్యూస్) :**
జమ్మికుంట పట్టణంలో పలు బిర్యాని సెంటర్లు మెస్ లలో మద్యం సిట్టింగులకు అనుమతి లేదని హోటల్లో మద్యం సరఫరా చేస్తే హోటల్ యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ వరగంటి రవి తెలిపారు. గురువారం పట్టణంలోని పలు బిర్యాని సెంటర్ల యజమానులు మెస్ యజమానులకు పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, హోటల్స్ లో కేవలం భోజనాల మాత్రమే ఉండాలని మద్యం సేవించడానికి అనుమతి లేదని అలాగే రాత్రి పది తర్వాత ఫొటోస్ తెరిచి ఉంచితే కేసులు నమోదు చేస్తామని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పలు హోటల్స్ ఉన్నాయని ఇకపై పద్ధతులు మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రతి హోటల్లో కచ్చితంగా సి సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని వీలైనంతవరకు హోటల్స్ లో గొడవలు లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పలువురు హోటల్ యజమానులు పాల్గొన్నారు.

# మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా కర్ర సత్య ప్రసన్న రెడ్డి

- రెండోసారి ఎన్నికైన మహిళ నేత



**జమ్మికుంట, జనవరి 16 (నినాదం న్యూస్) :**
కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ గౌడ్ అధ్యక్షురాలిగా రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన కర్రసత్య ప్రసన్నరెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తగా ప్రసన్న రెడ్డికి అధిష్టానం మరోక అవకాశాలు కల్పించింది. రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఒక ప్రకటనలో కర్ర సత్య ప్రసన్నారెడ్డి పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన హుజురాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు లభిస్తుందని అందుకు ఉదాహరణ జిల్లా అధ్యక్షురాలు సత్య ప్రసన్నరెడ్డి నియామకమే ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నతమైన పదవులు పొంది పార్టీ అభివృద్ధి కొరకు పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జాతర తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం



**భీమదేవరపల్లి జనవరి 16 (నినాదం న్యూస్):**
హనుమకొండ జిల్లా భీమదేవం పల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో అంగడి రాజవ్వ (42) అనే మహిళ బుధవారం రాత్రి తప్పిపోయింది. జనగామ జిల్లా చిల్పూర్ మండలం కృష్ణాజిగూడెం గ్రామానికి చెందిన రాజవ్వ దైవ దర్శనం కోసం కొత్తకొండకు వచ్చారు. ధర్మారం దాటి వెళ్తుండగా హుస్నాబాద్ పెట్రోలింగ్ పోలీసులు ఆమెతో మాట్లాడగా స్పందించలేదు. పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

# నటుడి సైఫ్ అలీ ఖాన్‌పై దాడి

- కత్తితో పొడిచిన దుండగుడు అనుమానాస్పద వ్యక్తి
- తచ్చాడుతుండగా అడ్డుకున్న సైఫ్
- తప్పించుకునే ప్రయత్నంలో కత్తితో దాడి
- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు
- ప్రాణాపాయం లేదని ప్రకటించిన వైద్యులు



**ముంబై,జనవరి16(నినాదం న్యూస్):** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి సంచలనంగా మారింది. గురువారం తెల్లవారుజామున ముంబైలోని తన ఇంటి వద్ద ఓ ఆగంతకుడు కత్తితో దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. సైఫ్ అలీఖాన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. సైఫ్ అలీ ఖాన్ ముంబైలోని తన ఇంట్లో 11వ అంతస్తులో నిద్రిస్తుండగా అనుమానాస్పద శబ్దాలు రావడంతో అతనికి మేలుకువ వచ్చింది. ఓ వ్యక్తి ఇంట్లో దొంగతనానికి యత్నించగా సైఫ్ అతడిని పట్టుకోబోయాడు.. అయితే, ఆ దుండగుడు సైఫ్ నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో జరిగింది. సైఫ్ నుండి తప్పించుకునేందుకు ఆ ఆగంతకుడు సైఫ్‌పై ఆరుసార్లు కత్తితో పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దాడిలో సైఫ్ తీవ్రంగా గాయపడ్డారు. అతడి కేకలు విన్న కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై హుటాహుటినా అతడిని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాంద్రా పోలీసులకు తెల్లవారుజామున 3 గంటలకు ఫిర్యాదు చేశారు. సైఫ్ అలీఖాన్‌ను బాంద్రా ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడిచారని, తెల్లవారుజామున 3.30 గంటలకు ఆయనను ఆసుపత్రికి తీసుకువచ్చారని లీలావతి హాస్పిటల్ సిఓఓ డాక్టర్ నీరాజ్ తెలిపారు. సైఫ్ అలీఖాన్ ఆరు కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడ్డారని..వాటిలో ఒకటి వెన్నెముకకు ప్రమాదకరంగా ఉందని తెలిపారు. న్యూరోసర్జన్ డాక్టర్ నితిన్ డాంగే, కాస్మెటిక్ సర్జన్ డాక్టర్ లీనా జైన్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ నిషా గాంధీ నేతృత్వంలోని వైద్యుల బృందం సైఫ్ అలీఖాన్‌కు 2.5 గంటల పాటు న్యూరో సర్జరీ చేసింది. సైఫ్ ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని ఆసుపత్రి సిబ్బంది ధృవీకరించింది. నటుడు ప్రస్తుతం కోలుకుంటున్నారని, వైద్యులు అతని పురోగతిని పర్యవేక్షిస్తున్నారని సైఫ్ అలీ ఖాన్ బృందం ప్రకటన చేసింది. బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఆగంతకుడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడని, దాడి జరిగిన సమయంలో కొందరు నటుడి కుటుంబ సభ్యులు కూడా ఇంట్లో ఉన్నారని పోలీసు అధికారి తెలిపారు. సైఫ్ అలీఖాన్ ఇంట్లో పనిచేస్తున్న ముగ్గురు అటెండర్లను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు కేసు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. నిందితుడి కోసం క్రైమ్ బ్రాంచ్ 7 బృందాలను ఏర్పాటు చేసింది. క్లూల కోసం ఓ బృందం సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తోంది. ముంబైలోని వివిధ ప్రాంతాలకు మూడు బృందాలు బయలుదేరాయి.నిందితుడి కోసం ముంబై నుంచి ఓ బృందం వెతుకుతుంది. గురువారం ఉదయం బాంద్రా (పశ్చిమ) లోని సైఫ్ ఇంటి బయట స్నిఫర్ డాగ్స్ కనిపించాయి. ముంబై పోలీసులు ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. సైఫ్ అలీఖాన్ బృందం ఓ ప్రకటనలో 'మిస్టర్ సైఫ్ అలీఖాన్ నివాసంలో ఓ దుండగుడు చోరీకి ప్రయత్నించాడు. ఈ ఘటనలో సైఫ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మీడియా, అభిమానులు సమయమనం పాటించాలి' అని కరీనా కపూర్ తెలిపారు. మిగిలిన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారని కరీనా కపూర్ బృందం ధృవీకరించింది. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారని, ఆయన అభిమానుల ప్రార్థనలు ఫలించాయని, ఆపరేషన్ చేసిన వైద్య బృందానికి ధన్యవాదాలని తెలిపారు.

### దాడికి ముందు సైఫ్ ఇంట్లోకి

## ఎవరూ ప్రవేశించలేదు

- ఇంట్లో ఉన్న వారే ఈ దాడికి పాల్పడి ఉంటారని అనుమానం
- సైఫ్‌తో పాటు మరో మహిళకు కూడా గాయాలు
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

**ముంబై, జనవరి 16(నినాదం న్యూస్):** సైఫ్‌పై దాడి ఘటన జరగడానికి రెండు గంటల ముందు వరకూ సైఫ్ నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లోకి ఎవరూ ప్రవేశించలేదని తేలింది. సీసీటీవీ ఫుటేజ్‌లో ఎవరూ అనుమానాస్పదంగా కూడా కన్పించలేదు. దీంతో ఇంట్లో ఉన్న వారే ఈ దాడికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా.. సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో ఒక డక్ట్ ఉందని, అది అతని బెడ్ రూమ్‌లో తెరుచుకుంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నిందితుడు అక్కడి నుంచే అతని ఇంట్లోకి ప్రవేశించి ఉండొచ్చన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ దాడిలో సైఫ్ అలీఖాన్‌తో పాటు అతని నివాసంలోని మహిళా సిబ్బంది కూడా కత్తిపోట్లకు గురైనట్లు పోలీసులు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సదరు మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వెల్లడిరచారు. మరోవైపు సైఫ్ అలీఖాన్ సిబ్బందిలోని ఐదుగురిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు ముంబై పోలీసులు తెలిపారు. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విరీద దాడి జరిగిన విషయం తెలిసిందే. అతడిపై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. గురువారం తెల్లవారుజామున ముంబైలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ఆయన ఒంటిపై ఆరుచోట్ల గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన లీలావతి దవాఖానకు తరలించారు. సైఫ్ అలీఖాన్‌కు రెండు చోట్ల లోతుగా గాయలయ్యాయి. వెన్నెముక పక్కన కూడా కత్తి పోట్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

### సైఫ్‌పై దాడి అనంతరం

## లీలావతి ఆస్పత్రికి తరలింపు

- పెద్దకుమారుడు ఇబ్రహీం ఆటోలో తరలించినట్లు కథనాలు
- ఆస్పత్రికి చేరుకున్న నటుడు షారూఖ్ ఖాన్

**ముంబయి, జనవరి 16(నినాదం న్యూస్):** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై గుర్తుతెలియని దుండగుడు దాడికి గాయపడిన సైఫ్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సైఫ్‌ను ఆయన పెద్ద కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ ఆటోలో ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో కథనాలు ప్రచురితమయ్యాయి. దాడి జరిగిన సమయంలో ఇంటి వద్ద కారు సిద్ధంగా లేకపోవడంతో.. ఇబ్రహీం తన తండ్రిని ఆటోలో తీసుకువచ్చాడని సమాచారం. బాంద్రాలోని సైఫ్ నివాసంలో గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. దుండగుడు సైఫ్ చిన్న కుమారుడు జేష్ గదిలో నక్కినట్లు పలు వార్తలు వచ్చాయి. దుండగుడిని చూసిన జేష్ కేర్‌టేకర్ కేకలు వేయగా సైఫ్ అక్కడికి చేరుకొన్న సమయంలో పెనుగులాట జరిగింది. ఈక్రమంలో సైఫ్ గాయపడ్డారు. ఆరుచోట్ల కత్తి గాయాలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ని హుటాహుటిన లీలావతి ఆస్పత్రికి తరలించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన క్షేమంగా ఉన్నారని వైద్యులు ప్రకటన విడుదల చేశారు.ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దుండగుడిని పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈక్రమంలోనే సైఫ్ నివాసానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించారు. సైఫ్ నివాసంలో పనిచేస్తోన్న వారందరినీ ప్రశ్నించారు. ఎంలోర్ పాలిషింగ్ చేసే వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సైఫ్‌పై జరిగిన దాడి గురించి తెలుసుకుని సినీ ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సోషల్‌విరీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.

## కొత్తకొండ వీరన్నను దర్శించుకున్న ఎల్కతుర్తి సీఐ



**భీమదేవరపల్లి జనవరి 16 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే జాతర లో భక్తులు అధిక సంఖ్య పాల్గొంటున్నారు. గురువారం ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ కుటుంబ సమేతంగా స్వామివారి కి గుమ్మడికాయ, కోడే,మొక్కులు సమర్పించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వణ అధికారి పి కిషన్ రావు,అర్చకులు సిఐ రమేష్ కి దేవస్థానం తరపున అమ్మవారికి మార్చిన శేష వస్త్రము తో స్వామివారి చిత్రపటం ఇచ్చి సన్మానం చేసినారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

## దివ్యాంగుల అనాధాశ్రమానికి లక్ష రూపాయల విరాళం అందజేత

**కోదాడ,జనవరి 16(నినాదం న్యూస్):**



కోదాడకు సమీపం లోని అశోక్ నగర్ లో గల స్థానిక శనగల రాధాకృష్ణ మానసిక దివ్యాంగుల అనాధా శ్రమానికి కోదాడ పట్టణానికి చెందిన వీరేపల్లి వెంకట సుబ్బారావు వారి సతీమణి రుక్మిణమ్మ జ్ఞాపకార్థంగా లక్ష రూపాయల విరాళంను కోదాడలోని వారి నివాసంలో సంస్థ నిర్వాహకులు శనగల జగన్మోహన్ కు అందజేశారు. అమెరికాలో స్థిరపడిన వారి కుమారుడు వీరేపల్లి వెంకటేశ్వరరావు సతీమణి స్మిత తో కలిసి కోదాడ కు వచ్చిన సందర్భంగా ఈరోజు దివ్యాంగుల అనాధాశ్రమాన్ని సందర్శించి అనాథలను మానసిక దివ్యాంగులను చేర దీసి ఆశ్రయం కల్పిస్తున్న నిర్వాహకులు శనగల జగన్మోహన్ ను వారు ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగులకు, సంస్థకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## అఫ్ఘాన్‌లో భూకంపం

**కాబూల్, జనవరి16 (నినాదం న్యూస్):** ఆఫ్ఘనిస్తాన్‌లో గురువారం ఉదయం భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 4.2గా నమోద్కెందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడిరచింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. గురువారం తెల్లవారుజామున 2.52 గంటల సమయంలో ఈ భూకంపం సంభవించింది. వెడల్పు 36.65, పొడవు : 71.33, లోతు : 180 కి.విరీ మేర భూమి కంపించిందని ఎన్‌సిఎస్ ఎక్స్ పోస్టులో పేర్కొంది. ఈ భూప్రకంపనల ధాటికి ఇళ్లు నేలమట్టమయ్యాయి. ÷రీగా, బుధవారం ఉదయం భూకంపం సంభవించింది. మళ్లీ వెంటనే గురువారం కూడా సంభవించిందని ఎన్‌సిఎస్ తెలిపింది.

## నాకు సొంతంగా ఇల్లు, కారు లేదు

### -ఆస్తుల వివరాలు వెల్లడించిన కేజ్రీవాల్

**ఢిల్లీ, జనవరి 16 (నినాదం న్యూస్):** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూ ఢిల్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన ఆస్తుల వివరాలను వెల్లడిరచారు. తనకు సొంతంగా ఇల్లు, కారు లేదని కేజ్రీ ప్రకటించారు. తాను 14 క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నట్లు వెల్లడిం చారు. తనకు మొత్తం రూ.1.73 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం తన చేతిలో రూ.40,000 నగదు, తన భార్య సునీత కేజ్రీవాల్ చేతిలో రూ.32,000 నగదు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా తన భార్య సునీత మొత్తం ఆస్తుల విలువ రూ.2.5 కోట్లుగా పేర్కొన్నారు. అందులో రూ.25 లక్షల విలువైన 320 గ్రాముల బంగారంతో పాటు రూ.92 వేల విలువైన కేజీ వెంటి ఉన్నట్లు వెల్లడిం చారు. ఇక సునీతకు గురుగ్రామ్‌లో ఇల్లు, ఒక మారుతి సుజుకి బెలెనో (2017 మోడల్) కారు ఉన్నట్లు తెలిపారు. దంపతులిద్దరి ఆస్తుల విలువ రూ.4.23 కోట్లుగా ప్రకటించారు.

# ఆర్ఎస్ఎస్ దిశగా యువత ఆసక్తి

విలక్షణమైన సంస్కృతి, సాంప్రదాయాలకు చిరునామాగా భారత్ ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. కర్మభూమి గా,వేద భూమి గా విభిన్నమైన లక్షణాలను కలిగి ఉన్న అఖండ భారతం మనది. భారతదేశానికి స్వతంత్రం సాధించడానికి ఎందరో మహా పురుషులకు జన్మభూమిగా మారిన పరమ పవిత్రమైన నేల. అలాంటి మహా పురుషులలో డాక్టర్ కేశవ్ బలరాం హెడ్గేవర్ ఒకరు. ఈ మహనీయుడు అటు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంటూనే స్వాతంత్ర్య సాధించిన అనంతరం భారతదేశాన్ని ఏ విధంగా రక్షించుకోవాలని వినూత్నమైన ఆలోచనలు చేసేవారు. భారతదేశం యొక్క సనాతన ధర్మం,సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవడంలో ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలని ఒక మేధోపరమైన ఆలోచన నుండి జనించింది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ యస్ యస్). 1925 సెప్టెంబర్ 27న ఆరుగురు సభ్యులతో నాగపూర్ లోని చిన్న మైదానంలో విజయదశమి రోజు సంఘాన్ని స్థాపించారు. దేశ చరిత్రలో భాగమైన ఈ సంస్థ మూలాలు మన తెలుగు నేలలో ఉన్నాయని చాలామందికి తెలియకపోవచ్చు. కేశవ్ బలరాం హెడ్గేవర్ జన్మస్థలం బోధన్ తాలూకలో కందకుర్తి అనే చిన్న గ్రామం. హెడ్గేవర్ వాళ్ళ కుటుంబం తొలినాళ్లలో ఇక్కడే ఉండేవారు. కాలక్రమేణ వీరి కుటుంబం మహారాష్ట్రలోని నాగపూర్ లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. సాంప్రదాయ కుటుంబంలో జన్మించి చిన్నతనం నుండి భారతదేశం దాని యొక్క సనాతన ధర్మం ,హైందవ సాంప్రదాయాలు గురించి తెలుసుకున్నారు.ఉన్నత విద్య పూర్తయిన తర్వాత 35 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ వాళ్ల ఆకృత్యాలను విమర్శిస్తూ వచ్చారు.స్వామి వివేకానంద, అరబిందో లాంటి హిందూ సామాజిక ఆధ్యాత్మిక సంస్కర్తల భావజాలానికి ఆకర్షితులయ్యారు. 1921లో ఒక ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు. హిందూ మహాసభలో సభ్యుడిగా చేరి చాలా కాలం పాటు అందులో కొనసాగారు. భారతీయులపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి స్వయంగా సేవ చేయగల ఆలోచనలు కలిగిన వాళ్లను ఏకం చేయడం కోసం ఆర్ఎస్ఎస్ ను బలోపేతం చేయడానికి శ్రీకారం చుట్టారు. దాదాపు 99ఏళ్ల క్రితం ఆర్ఎస్ఎస్ ఆవిర్భంలో మొదటగా భయ్యాజీ థానే, బాపురావ్ దేవారస్, బాలసాహేబ్ దేవారస్, వెంకటప్ప పాట్కీ,అప్పాజీ జోష్ అనే ఆరుగురు సభ్యులుగా ఉన్నారు. నాడు ఆరుగురు సభ్యులతో మొదలైన సంస్థ నేడు సుమారు 50 లక్షలకు పైగా స్వయంసేవకుతో వెలుగొందుతుంది. భారతదేశ నైతిక ,సాంస్కృతిక , ఆధ్యాత్మిక ,సాంప్రదాయాలను సంరక్షించడమే ఈ సంస్థ ప్రధాన ఆశయం.ఇందులో భాగంగా హైందవాన్ని ఒక మతంగా కాకుండా ఒక జీవన విధానంగా ఈ సంస్థ భావిస్తుంది. భారతదేశ జాతిని, భారత దేశ ప్రజలను భరతమాతగా భావించి వారికి విశేషమైన సేవలు అందించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం. ఈ సంస్థకు గుర్తుగా కాషాయ జెండాను ఎంచుకున్నారు.ఈ సంస్థ సర్వోన్నత నాయకత్వాన్ని సర్ సంఘ్ చాలక్ గా పేర్కొంటారు. సంఘ్ స్థాపించినప్పటి నుండి 1940 వరకు సర్ సంఘ్ చాలక్ గా డాక్టర్ జీ కొనసాగారు. ఇప్పటివరకు ఆరుగురు సర్ సంఘ్ చాలక్ లుగా తమ సేవలందించారు.వారిలో 1993 సంవత్సరంలో మధుకర్ దత్తాత్రేయ దేవారవ్ దాదాపు రెండు దశాబ్దాలుగా సర్ సంఘ్ చాలక్ తమ సేవలను కొనసాగించారు. తదనంతరం రాజేంద్ర సింగ్ 2000 సంవత్సరం వరకు ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ గా పూర్తి సమయాన్ని కేటాయించారు. ఆ తర్వాత 2000 సంవత్సరం నుండి 2009 వరకు సుదర్శన్ జీ తర్వాత 2009మార్చి21 నుండి మోహన్ భగవత్ సర్ సంఘ్ చాలక్ గా కొనసాగుతున్నారు. 1928 సంవత్సరంలో దాదాపు 99 మంది యువకులు ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులై సంఘంలో చేరడం జరిగింది.అప్పుడు డాక్టర్ జీ ఒక పవిత్రమైన ప్రార్థనను వారికి బోధించడం జరిగింది. అదే ప్రార్థనను నేటికి ఆర్ఎస్ఎస్ అనుసరిస్తూ వస్తుంది. ఆర్ఎస్ఎస్ అంటే గుర్తుకు వచ్చేది తెల్లని చొక్క నల్లని టోపీ కాకి రంగు నిక్కర్ ,తోలు బెల్టు కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా నిక్కరు స్థానంలో ప్యాంట్ తీసుకురావడం జరిగింది. ఈ ప్రయాణంలో ఆర్ఎస్ఎస్ ఎన్నో పదుల సంఖ్యలో దాని అనుబంధ సంస్థలను స్థాపించింది. అందులో ప్రధానంగా దేశ రాజకీయాల్లో చరిత్ర సృష్టిస్తున్న భారతీయ జనతా పార్టీ ఒకటి బజరంగ్ దళ్ , విశ్వహిందూ పరిషత్,అఖిలా భారతీయ విద్యార్థి పరిషత్ ఇలా మొదలైన సంస్థలు దాని క్షేత్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ ఉన్నాయి. వీటన్నిటినీ కలిపి సంఘ్ పరివార్ సంస్థలు అంటారు. భారతీయ ప్రాచీన సాంప్రదాయాలను రక్షించడంలో భాగంగా స్వయంసేవకులు నిస్వార్థంగా సేవ చేయడం ఈ సంస్థ గొప్ప లక్షణం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ను అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా అభివర్ణించిన సంఘ్ మాత్రం రాళ్లను,పూలను సమానంగా స్వీకరిస్తూ క్రమశిక్షణతో ఒక బలమైన ఆత్మవిశ్వా సంతో అనునిత్యం సేవలో ముందుకు నిలుస్తూ ఉండడం ఈ సంస్థ గొప్పతనం.స్వాతంత్ర ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఉండడం చాలా గొప్ప విషయం.1938 సంవత్సరం డిసెంబర్ నాగపూర్ ఆర్ఎస్ఎస్ శిక్ష వర్గాలో స్వాతంత్ర్య సమరయోధుడు వీరసావర్కర్ పాల్గొనడం జరిగింది. ఆ ఏడాది బాంబే ప్రెసిడెన్సీ ప్రభుత్వ ఉద్యోగులు సంఘ్ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొన వద్దని ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అదే సమయంలో డాక్టర్ జీ హైదరాబాద్ లో నిజాం పాలకులకు వ్యతిరేకంగా హిందూ యువక్ పరిషత్ ను స్థాపించి భాగ్యనగర్ విముక్తి సంగ్రామ్ పేరుతో ఉద్యమించడం జరిగింది. ఆర్ఎస్ఎస్ దేశంలో ఏ మూలన విపత్తు సంభవించిన సహాయం చేయడంలో ఆపద్బాంధవులా ఉంటుంది. వరదలు, భూకంపాలు, దాడులు, అల్లర్లు ఇలా ఎలాంటి ఆపదలు వచ్చిన సమయంలో సేవ చేయడం కోసం అహర్నిశలు పాటుపడుతుంది. దేశంలో జరిగే ఆకృత్యాలను, విపత్కర సంఘటనలను ముందే పసిగట్టి ప్రభుత్వాలకు తమ సలహాలను తెలియజేస్తుంది. దేశ ప్రజల సంక్షేమానికి దేశ రక్షణకై తీసుకోవాల్సిన చర్యల గురించి అవలోకనం చేసి సూచనలు చేస్తుంది. ఆర్ఎస్ఎస్ అనేది ఒక కరడు కట్టిన హిందూ భావజాలం కలిగిన సంస్థగా కొందరు ప్రచారం చేసిన అది భారతదేశ ఖ్యాతిని,ఘన కీర్తిని కాపాడుటలో తన వంతు కృషి చేస్తుంది. బాబ్రీ మసీద్ కూల్చివేత, గాంధీ హత్య ఇలా అనేక వివాదాలకు కేంద్ర బిందువు అని చెప్పిన చాలామందికి ఇది ఒక ఆరాధ్య దైవం. ఆర్ఎస్ఎస్ అనేది సేవా భారతి పేరా దాదాపు రెండు లక్షలకు పైగా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తుంది.1946 ఆగస్టు 16 కలకత్తాలో రెండు వర్గాల మధ్య ఉచకోత జరిగినప్పుడు ఎంతో సహాయ సహకారాలు అందించింది. 1947 జూన్ 3 దేశవిభజన సమయంలో అల్లర్లు జరిగి పంజాబ్ ,బెంగాల్ సరిహద్దు రాష్ట్రంలో అనేక దాడులు జరిగాయి అప్పుడు 3 వేలకు పైగా సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి సంఘ్ తన ఔదార్యాన్ని చాటుకుంది.1952 సంవత్సరం దేశంలో గో హత్యను నిషేధించాలని దాదాపు కోటి మందికి పైగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి ప్రభుత్వాలకు పంపింది. 1954లో పోర్చుగీసులో దాద్రా హవేలీ నగరం విముక్తికై పోరాటాన్ని చేసింది.1955 లో పోర్చుగీసు ఆధీనంలో ఉన్న గోవా విముక్తి



కూడా అలుపెరుగని పోరాటానికి నాంది పలికింది.1966 సంవత్సరంలో బీహార్ ప్రాంతంలో కరువుతో తల్లడిల్లుతున్న ప్రాంతాల ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందించింది. 1977 సంవత్సరం ఆంధ్రప్రదేశ్ లో పెను తుఫాను సంభవించినప్పుడు తన శక్తిని మించి సహాయ, సహకారాలు చేపట్టింది.2001 గుజరాత్ భూకంపం విపత్తులో కూడా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆర్ఎస్ఎస్ అనేది కేవలం ఒక హిందుత్వ సంస్థని ముద్రవేసిన కొందరి అతి మేధావుల మాటను తిప్పికొట్టేలా సంఘ్ అద్వితీయమైన కార్యాచరణలో ముందుంటుంది. భారతీయత, సేవగుణంతో సంఘ్ ఎల్లప్పుడూ శ్రమిస్తూనే ఉంటుంది.భారతీయుడు సాటి భారతీయునికి ఎప్పుడూ పరాయివాడు కాదని నమ్మి అందరిని సంఘటితం చేసి ఒకేతాటి మీదికి తీసుకురావడం కోసం ఆర్ యస్ యస్ అవిరళంగా కృషి చేస్తుంది. దేశంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఉన్న తమ శక్తి సామర్థ్యాలమేరా సేవ చేయడంలో వెనకడుగు వేయకా ఆదర్శంగా నిలుస్తుంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రధానంగా భావించేది శాఖ. ప్రతిరోజు శాఖలో ఒక వ్యక్తి యొక్క నిర్మాణం కోసం ఉపయోగపడే ప్రతి అంశాన్ని చేరువ చేయడం జరుగుతుంది. ఒక వ్యక్తి పురోగతి సాధించాలంటే మానసికంగానే కాదు భౌతికంగా శారీర ధారుఢ్యం కలిగి ఉండాలనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల్లో ఒక భాగం. అందు కోసం వివిధ రకాల వ్యాయామం తప్పనిసరి. దేశభక్తి భావజాలం,జాతీయత అంశాలపై నిరంతరం యువతను జాగృత పరిచే నిస్వార్థమైన సేవకు మారుపేరు ఆర్ఎస్ఎస్. ఆర్ఎస్ఎస్ లోకి అన్ని వర్గాల వారు ఆహ్వానితులే కానీ వారి ఎజెండా మాత్రం దేశభక్తి, సేవ గుణం, క్రమశిక్షణ కలిగి ఉండడం. దేశ పురోగతిలో ఆర్ఎస్ఎస్ ఎన్నో అంశాల్లో జరగని ముద్రవేసి క్రమశిక్షణ అంటే ఆర్ఎస్ఎస్. ఆర్ యస్ యస్ అంటే క్రమశిక్షణ అనే విధంగా ఎంతో మంది మహనీయుల గుర్తింపు పొందింది. ఆర్ఎస్ఎస్ స్థాపించి సుమారు వంద సంవత్సరాలు కావస్తున్నా క్రమంలో ఇంత గొప్పగా ఒక సంస్థ అంతులేని అభిమానాన్ని పొందడం చాలా అరుదుగా చెప్పవచ్చు. ఆర్ఎస్ఎస్ అంటే నేటికీ చాలామందికి తెలియకపోవచ్చు కానీ దాని సేవ మార్గం,దేశభక్తి ,జాతీయత భావజాలం నేటి యువతకు చేరువ చేయడంలో ఆర్ఎస్ఎస్ నిరంతరం శ్రమిస్తూనే ఉంటుంది. నేటి మన ధర్మం మీద మనం ఎంతో ప్రాధాన్యంగా దేవాలయాల మీద ఉన్మాదపూరిత దాడులను నిశితంగా గమనిస్తున్న యువత ఈ పరిస్థితుల్లో మార్పుకై ఆలోచనలు చేస్తుంది. సనాతనధర్మం, దేశభక్తి భావజాలం కలిగిన సంఘ్ వైపు ఆసక్తి చూపుతున్నారు. సంఘ్ కూడా యువత ఆలోచనాలకు అనుగుణంగా శిక్షణా శిబిరాలు నిర్వహించి జాతీయత భావజాలం పట్ల, దేశభక్తి పెట్టు జాగృతం చేస్తూ వస్తుంది.

**– వంశీకృష్ణ గౌడ్. బండి రంగయ్యపల్లి, రేగొండ, జయశంకర్ భూపాలపల్లి**

# కాకలు తీరిన కమ్యునిస్టు యోధుడు జ్యోతిబసు


భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సి స్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలం దించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవ హర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు. 1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహ రించారు.1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల



1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

# త్రి భాషల్లో తొలి టాకీ చిత్రాల్లో నటించిన ఎల్.వి.ప్రసాద్


భారతీయ సినిమాకి నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకు డుగా, నటుడుగా సినీ నిఘంటువు లో తనకంటూ కొన్ని పేజిలు సృష్టిం చుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్', తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఎల్ .వి ప్రసాద్ సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను, ఆయ నతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!? భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదా సాహేబ్ ఫాల్కే అవార్డును అందు కున్న ఎల్.వి.ప్రసాద్. ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్.వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం అరా, కాళిదాస్ మరియూ భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధిం చారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటంగానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం',' ‘ద్రోహి','సంసారం', 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు. ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకాలోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారా బంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఊరూరా తిరిగే నాటకా ల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడా రపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తర చూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవాతు. ఇదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటన పై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించ డానికి పునాదులు వేసింది. 1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశంలోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి. ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించినందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయ కుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శ కత్వంలో రూపుదిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామా రావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి. ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు. 1931లో ఆలం ఆరా - మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ - మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద - మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా




స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947), ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావు కారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు. జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. వరల్డ్‌లోనే బెస్ట్ ఐ హాస్పిటల్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన నెలకొల్పిన 'ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్' దేశంలోనే అత్యున్నత నేత్ర చికిత్సాలయంగా పేరొందింది. ఆయన వారసులు దేశంలోనే అతి పెద్ద ఐమాక్స్ థియేటర్‌ను భాగ్య నగరంలో నిలిపారు ఎల్వీ ప్రసాదు స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

# నయా మాల్.. ఎక్కడున్నా ట్రాక్ చేయొచ్చు



**లక్షలు పోసి కారు కొంటాం. మనం వాడుకుంటూనే.. అవసరానికి ఏ ఫ్రెండుకో.. అద్దెకో ఇస్తుంటాం. అలాంటప్పుడు కారు ఎక్కడుందో.. ఏ రూటులో వెళ్తున్నదో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలంటే? సింపుల్.. ఓ జీపీఎస్ ట్రాకర్‌ని వాడేస్తే సరి. అలాంటిదే ఈ రాక్‌టెక్ మినీ మాగ్నెటిక్ జీపీస్ ట్రాకర్. సురక్షితమైన చోట దీన్ని అతికించి కారును ఎప్పటికప్పుడు ట్రాక్ చేయొచ్చు. ఇందులో బిల్ట్ ఇన్- మైక్రోఫోన్‌తోపాటు యాంటి థెఫ్ట్ సిస్టమ్ కూడా ఉంది. ఈ సదుపాయాన్ని వాడుకునేందుకు ట్రాకర్ లోపల యాక్టివేట్ చేసిన సిమ్ కార్డును ఇన్‌సర్ట్ చేయాలి. దీన్ని కారుతోపాటు సూట్‌కేసులు, పిల్లల స్కూల్ బ్యాగులకూ అమర్చుకోవచ్చు. దీంట్లో గూగుల్ మ్యాప్స్ పొజిషన్ కూడా పెట్టుకోవచ్చు.**

ధర: రూ.2,999
దొరికే చోటు: అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్స్

పద్ధతిగా వాడుకునేందుకు..


ఒకటా.. రెండా.. మినిమమ్ మూడు చార్జర్లు నిత్యం అందుబాటులో ఉంచుకోవాల్సిందే. ఒకటి స్మార్ట్‌ఫోన్ చార్జర్.. ఇంకోటి స్మార్ట్‌వాచ్ కోసం.. మరొకటి ఇయర్ ఫోన్స్‌కి. అయితే, ఈ చార్జర్లను వాడే క్రమంలో పిన్స్ అడ్డదిడ్డంగా వదిలేయకుండా.. ఓ పద్ధతి ప్రకారం టేబుల్ దగ్గర సెట్ అయ్యేలా చేస్తే!! ఇదిగోండి కావాలంటే%ౌ ాూఖూౌు ఝుఎశ్రీవ ఎశీశ్రీసవతీ% క్లిప్స్‌ని చూడండి. వీటిని చక్కగా టేబుల్‌కి సెట్ చేసుకుంటే చాలు. అన్ని పిన్స్‌నీ చక్కగా క్రమపద్ధతిలో అమర్చుకుని చార్జ్ పెట్టుకోవచ్చు. ఈ క్రమంలో టేబుల్ పక్కన పిన్ ఎక్కడుందా? అని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉండదు. ఇంటర్నెట్ కేబుల్, డేటా కేబుల్, మౌస్ కేబుల్, ఆడియో కేబుల్స్‌ని కూడా కేబుల్ హోల్డర్‌లో సెట్ చేసుకోవచ్చు. మీ వర్క్ స్పేస్‌కి అనువుగా హోల్డర్‌ని అతికించుకోవచ్చు. అవసరమైతే కారులోనూ అమర్చుకోవచ్చు.

ధర: రూ.1,000
దొరికే చోటు: అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్స్




పుస్తక ప్రియులకు ప్రత్యేకం

బుక్ రీడింగ్ అలవాటు ఉన్నవారికి టైమ్‌తో సంబంధం ఉండదు. ఎప్పుడైనా చదివేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే, రాత్రి సమయంలో చదివేటప్పుడే గదిలో లైట్ కారణంగా ఇతరులకు కాస్త ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు ఎవరికీ ఏ ఇబ్బందీ లేకుండా బుక్ రీడింగ్ చేసేందుకు ల్యాంప్‌ని ప్రయత్నించొచ్చు. ఈ పోర్టబుల్ లైట్‌ని పుస్తకానికి అమర్చుకుని హాయిగా చదువుకోవచ్చు. ఒక్కో పేజీని లైటు వెలుతురులో చూపిస్తుంది. ఎవరైనా మన పక్కనే నిద్రపోతున్నా.. ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అంతలా ఈ ప్యానల్ లైట్‌ని తీర్చిదిద్దారు. ప్రయాణాల్లో దీన్ని ఎక్కడికైనా పుస్తకంతోపాటే తీసుకెళ్లొచ్చు. బ్యాటరీ పవర్ సోర్స్ ద్వారా ఇది పనిచేస్తుంది.



ధర: రూ.599
దొరికే చోటు: అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్స్

టైమర్ పెట్టుకుంటున్నారా?

రోజువారీ లైఫ్ ట్కస్టైలో కొన్ని పనులకు టైమర్ పెట్టుకోవడం అలవాటుగా మారిపోతున్నది. అలాంటి అలవాటు ఉన్నవాళ్లు టైమర్ కోసం ఫోన్‌ని వెతకాల్సిన పనిలేదు. ఇదిగో ఈ టైమర్‌ను అందుకోండి చాలు. దీని పేరేంటంటే.. . ఎల్‌సీడీ డిస్‌ప్లే, మూడు బటన్స్‌తో టైమర్‌ని వాడుకోవచ్చు. అలాగే, టైమ్‌ని సెట్ చేసేందుకు ప్రత్యేక కంట్రోల్స్ ఉన్నాయి. రెండు రకాలుగా అలారం పెట్టుకోవచ్చు. అలారం ట్యూన్స్‌తోపాటు.. ఫ్లాష్ లైట్ మోడ్‌ని యాక్టివేట్ చేయొచ్చు. కావాలంటే.. ఫ్లాష్ లైట్‌ని మ్యూట్ చేసుకోవచ్చు కూడా. టైమర్‌లో 'కౌంట్ అప్, కౌంట్ డౌన్' మోడ్స్ ఉన్నాయి. పిల్లలు చదువుకునేటప్పుడు.. కంప్యూటర్, ఫోన్‌లు వాడేటప్పుడు టైమర్‌ని పెట్టుకోవచ్చు. దీంతో స్క్రీన్ టైమ్‌ని కంట్రోల్ చేయొచ్చు. అలాగే, పెద్దలు యోగా, వ్యాయామం చేసేటప్పుడు కూడా ఈ టైమర్ పెట్టుకోవచ్చు.

ధర: రూ.999
దొరికే చోటు: అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్స్



# తమిళ, కన్నడలో
# అవకాశాలు

'బేబీ' చిత్రం కథానాయిక వైష్ణవి చైతన్య కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటూ కథాబలమున్న చిత్రాలనే అంగీకరిస్తున్నది వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఈ భామ తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ సరసన 'జాక్' చిత్రంలో నటిస్తున్నది. మరికొన్ని పెద్ద చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరికి తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా భారీ ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది.

అక్కడ రెండు చిత్రాలకు ఆమె సైన్ చేశారని సమాచారం. ఈ ఏడాది తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో కూడా మంచి విజయాలను సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నది వైష్ణవి చైతన్య. సోషల్‌మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో తన సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకుంటుంది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కొత్త ఏడాది నటిగా తనను మరో మెట్టెక్కిస్తుందనే నమ్మకంతో ఉంది వైష్ణవి చైతన్య.

సోయగం
Soyagam